ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 144 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 2 సెప్టెంబర్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



### మూడు నెలల్లో వందే భారత్
## స్లీపర్ కోచ్ సేవలు

**ప్రకటించిన కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్**
**వందే భారత్ స్లీపర్ కోచ్ ప్రొటోటైప్ వెర్షన్ ఆవిష్కరణ**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1 (ప్రభాత ఉదయం): కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఆదివారం) వందే భారత్ స్లీపర్ కోచ్ ప్రొటోటైప్ వెర్షన్‌ను ఆవిష్కరించారు. బెంగళూరులోని భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్ ) ఫెసిలిటీలో వీటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేభారత్ చైర్ కార్ విజయం ..మిగతా 2లో

# తెలంగాణలో భారీ వర్షాలు
## ఇప్పటివరకు 9 మంది మృతి, మరో ఇద్దరు గల్లంతు



హైదరాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత ఉదయం): తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎక్కడికక్కడ వాగులు, వంకలు పొంగి పొర్లడంతో జనజీవనం అస్తవ్యస్తం అయింది. భారీ వర్షాలు, వరదల కారణంగా ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాష్ట్రంలో 9 మంది మృతి చెందినట్లు రెవెన్యూశాఖ మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. వరంగల్‌లో ఐదుగురు మృతి చెందగా, సూర్యాపేట జిల్లాలో ఇద్దరు, ఖమ్మం జిల్లాలో ఇద్దరు మృతి చెందారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు అత్యధికంగా ఐదుగురు మృతి చెందారు. సింగరేణి మండలం గేట్ కారేపల్లి గంగారం తండాకు చెందిన తండ్రి కుమార్తె వరద ప్రవాహంలో కొట్టుకుపోయారు. ఆయన కుమార్తె అశ్విని వ్యవసాయ శాస్త్రవేత్తగా రాయ్‌పూర్‌లో విధులు నిర్వహిస్తోంది. తండ్రితో కలిసి కారులో హైదరాబాద్ బయలుదేరగా మార్గమధ్యలో వరదలో చిక్కుకుపోయి కొట్టుకుపోయారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలో మందపల్లికి చెందిన భిక్షాటన చేసుకొనే వృద్ధురాలు మరణించింది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పశువులను మోతకు తీసుకెళ్లి వస్తుండగా వరద ప్రవాహానికి కొట్టుకుపోయి మృతి చెందాడు. పరకాల గ్రామానికి చెందిన మరో వ్యక్తి చెరువులో చేపల వేటకు వెళ్లి గల్లంతై చివరికి శవంగా బయటకువచ్చాడు. మరోవైపు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని నాయకన్ గూడెంలో పాలేరు వాగులో దంపతులు వరదనీటిలో కొట్టుకుపోయి చనిపోయారు. పాలేరు అలుగు సమీపంలో ఉన్న సిమెంటు ఇటుకల తయారీ కర్మాగారంలో ఓ కుటుంబం నివసిస్తోంది. పాలేరు జలాశయానికి ఆదివారం తెల్లవారుజాము నుంచి వరద పోటెత్తడంతో షేక్ యాకుబ్, భార్య సైదాబి, కుమారుడు షరీఫ్ వరదల్లో చిక్కుకుపోయారు. వరద ఉధ్ధృతి పెరగడంతో ప్రవాహంలో గల్లంతయ్యారు. కొట్టుకుపోతున్న షరీఫ్‌ను స్థానికులు, పోలీసులు కాపాడారు. ఉమ్మడి సూర్యాపేటజిల్లా కోదాడలో వరద నీటిలో రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. రాత్రి భారీ వర్షం కారణంగా కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు కొట్టుకుపోయాయి. కొట్టుకుపోయిన ఓ కారులో రవి అనే వ్యక్తి మృతదేహం లభ్యమైంది. శ్రీనివాస నగర్‌కు ..మిగతా 2లో



### తెలంగాణ-ఏపీ మధ్య నిలిచిపోయిన
## వాహనాల రాకపోకలు

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత ఉదయం): ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో రోడ్లన్నీ జలమయమవుతున్నాయి. దీంతో తెలంగాణ-ఏపీ మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. తెలంగాణ -ఏపీ సరిహద్దు రామాపురం వద్ద చిమిర్యాల వాగు ఉధ్ధృతంగా ప్రవహిస్తోంది. కోదాడ నుంచి వరదనీరు దిగువకు భారీగా ప్రవహిస్తోంది. నల్లబండగూడెం వద్ద జాతీయ రహదారిపైకి నీరు చేరింది. దీంతో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం ఐతవరం గ్రామం వద్ద జాతీయ రహదారిపై మున్నేరు వాగు ఉధ్ధృతంగా ప్రవహిస్తోంది. హైవేపై మోకాళ్ళ లోతులో వరద వస్తుండటంతో వాహనాల రాకపోకలను అధికారులు పూర్తిగా నిలిపివేశారు. విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాలు రాకుండా పోలీస్ రెవెన్యూ అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా హైదరాబాద్ వైపు చిలకల్లు టోల్ ప్లాజా వద్ద, విజయవాడ వైపు కీసర టోల్ ప్లాజా వద్ద వాహనాలను నిలిపివేశారు. దీంతో హైవే పూర్తిగా స్తంభించిపోయింది. వరద తగ్గేవరకు హైవేపై ఎవరినీ అనుమతించబోమని నందిగామ ఆర్డీవో రవీందర్‌రావు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా నల్లబండగూడెం వద్ద పాలేరు వాగులో ఆర్టీసీ బస్సు చిక్కుకుపోయింది. బస్సులోని 30 మంది ప్రయాణికులు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. రహదారులపైకి నీరు చేరుకోవడంతో విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సులను అధికారులు నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు విజయవాడ బస్టాండ్‌లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

#### వాహనాల దారి మళ్లింపు

సూర్యాపేట జిల్లా నల్లబండగూడెం వద్ద జాతీయ రహదారిపై వరద ప్రవాహం కొనసాగుతోంది. హైదరాబాద్- విజయవాడ మధ్య 5 గంటలుగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు పాలేరు వాగు విస్తృతంగా ప్రవహిస్తోంది. దీంతో హైదరాబాద్ నుంచి విజయవాడవైపు వెళ్లే వాహనాలను నార్కట్‌పల్లి- అద్దంకి వైపు పోలీసులు దారి మళ్లించారు. సూర్యాపేట నుంచి ఖమ్మం వైపు, కోదాడ నుంచి హుజూర్‌నగర్ మీదుగా గుంటూరువైపు మళ్లించారు. మరోవైపు విజయవాడ నుంచి వచ్చే వాహనాలను అద్దంకి-నార్కట్‌పల్లి వైపు మళ్లించారు. మరో 2 గంటలపాటు ప్రవాహం కొనసాగే అవకాశముందని అధికారులు వెల్లడించారు. పాలేరు వాగు ప్రవాహం తగ్గితే వాహనాల రాకపోకలకు అనుమతిస్తామని పోలీసులు తెలిపారు.

## వర్షాలపై సీఎం రేవంత్ అత్యవసర సమీక్ష
### 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశాలు



హైదరాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలపై సీఎం రేవంత్ రెడ్డి అత్యవసర సమీక్ష నిర్వహించారు. సీనియర్ మంత్రులు భట్టి, ఉత్తమ్, పొంగులేటి, తుమ్మల, దామోదర రాజనర్సింహ, జూపల్లి తదితరులతో ఫోన్లో రివ్యూ చేసి సీఎం రేవంత్ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. సీఎస్, డీజీపీ, మున్సిపల్, కరెంట్, పంచాయతీ రాజ్, హైడ్రా, ఇరిగేషన్ అధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని టెలి కాన్ఫరెన్స్ లో ఆదేశించారు. జిల్లాల్లో కలెక్టర్లు, ఎస్పీలు, రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు 24 గంటలు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సీఎం ఆదేశించారు. అధికారులు సెలవులు పెట్టొద్దని, సెలవులు పెట్టిన ..మిగతా 2లో




### విద్యుత్ శాఖలో 3 వేల ఉద్యోగాలకు
## వచ్చే నెలలో నోటిఫికేషన్
### ఖాళీలపై తేలని పంచాయితీ

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత ఉదయం): తెలంగాణ విద్యుత్ సంస్థల్లో భారీగా ఉద్యోగాలను భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. ఇటీవల విడుదల చేసిన తెలంగాణ జాబ్ క్యాలెండర్ ప్రకారం.. అక్టోబరులో విద్యుత్ శాఖలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల కావల్సి ఉంది. ఈ నేపథ్యంలో సంబంధిత వివరాలను పంపించాలని విద్యుత్ సంస్థలను రాష్ట్ర ప్రభుత్వం అడిగినట్లు సమాచారం. ప్రాథమిక సమాచారం ప్రకారం.. 4 విద్యుత్ సంస్థల్లో కలిపి మొత్తం 3 వేలకు పైగా ఖాళీలున్నట్లు తేలింది. ఇందులో పోస్టుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు అంచనా. ఈ లెక్కలు తేలితే వచ్చే నెలలో నోటిఫికేషన్లు జారీచేసే అవకాశాలున్నాయని అధికారులు చెపుతున్నారు. ఈ నేపథ్యంలో ఒక్కో క్యాడర్ వారీగా ఖాళీల వివరాలను సంస్థల ..మిగతా 2లో

### బంగ్లాదేశ్‌లో హిందూ ఉపాధ్యాయుల
## బలవంతపు రాజీనామాలు





హైదరాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత ఉదయం): బంగ్లాదేశ్‌లో సంక్షోభం ఇంకా కొనసాగుతోంది. ఆపద్ధర్మ ప్రధానిగా మహమ్మద్ యూనస్ బాధ్యతలు చేపట్టినా పెద్దగా మార్పు ఏమీ రాలేదు. హిందువులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారు. ఈ దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. అటు మహమ్మద్ యూనస్ కూడా వెంటనే ఈ దాడులు ఆపేయాలని పిలుపునిచ్చారు. అయితే...హిందూ టీచర్స్‌ని టార్గెట్‌గా చేసుకుంటున్నారు ఆందోళనకారులు. తక్షణమే వాళ్లు రాజీనామా చేయాలంటూ పట్టుబట్టారు. ఫలితంగా దాదాపు 49 మంది ఉపాధ్యాయులు అప్పటికప్పుడు రిజైన్ చేయాల్సి వచ్చింది. వెంటనే వాళ్ల రాజీనామా లేఖని సమర్పించారు. ఇది అనధికారికంగా తెలిసిన లెక్క మాత్రమే. నిజానికి ఇంత కన్నా ఎక్కువ మందే రాజీనామా చేసినట్టు సమాచారం. బంగ్లాదేశ్‌లో ఎంతో ఫేమస్ అయిన బకేర్‌గంజ్ గవర్నమెంట్ కాలేజ్ ప్రిన్సిపల్ శుక్లా రాణి హల్దేర్ రిజైన్ చేయడం సంచలనమైంది. ఆమె ఆఫీస్ ముందు ఆందోళనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వెంటనే రాజీనామా చేయాలని పట్టుబట్టారు. ఫలితంగా ఆమె ..మిగతా 2లో

## సినిమాల్లోనే కాదు రాజకీయాల్లోనూ 'క్యాస్టింగ్ కౌచ్'
### కేరళ నాయకురాలి సంచలన వ్యాఖ్యలు

కేరళ, సెప్టెంబర్ 1 (ప్రభాత ఉదయం): మహిళా నేత ఆరోపణలతో కేరళ కాంగ్రెస్‌లో రాజకీయ కలకలం రేగుతోంది. కేరళ కాంగ్రెస్‌లో పరిస్థితి సినీ పరిశ్రమ 'కాస్టింగ్ కౌ'లా ఉందని కాంగ్రెస్ నేత సిమి రోజ్‌బెల్ జాన్ ఆరోపించారు. మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళలపై లైంగిక వేధింపుల ఆరోపణలకు సంబంధించి హేమా కమిటీ నివేదిక సంచలనం సృష్టిస్తోంది. ఆ నివేదిక వచ్చిన తరుణంలో కాంగ్రెస్ నాయకురాలి నుంచి ఈ ప్రకటన వచ్చింది. మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై జస్టిస్ హేమ కమిటీ ఇచ్చిన నివేదిక ..మిగతా 2లో






### పశ్చిమ బెంగాల్‌లో
## ఆగని దారుణాలు
**ఈసారి మైనర్ బాలికతో పాటు నర్సుపై లైంగిక వేధింపులు**
**ఉత్తర 24 పరగణాస్, బీర్భూమ్‌లో ఘటన**

కోల్‌కతా, సెప్టెంబర్ 1 (ప్రభాత ఉదయం): పశ్చిమ బెంగాల్‌లోని ఆర్‌జీకార్ మెడికల్ కాలేజీలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య కేసు ఇంకా ముగియకముందే ఉత్తర 24 పరగణాస్‌లో మైనర్‌బాలికపై వేధింపుల ఘటన వెలుగు చూసింది. ఈఘటనతో ఆగ్రహించిన స్థానికులు నిందితుడి ఇంటిపై, అతని బంధువుల దుకాణంపై దాడి చేశారు. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌ను ప్రభుత్వం రంగంలోకి దించింది. ఇదే సమయంలో బీర్భూమ్ జిల్లాలోని ఓ ఆస్పత్రిలో నర్సుపై వేధింపులకు పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. మీడియాకు అందిన వివరాల ప్రకారం నార్త్ 24 పరగణాస్‌లోని రాజ్‌బరీ ప్రాంతంలో తొమ్మిదేళ్ల బాలికపై ఒక వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలియగానే స్థానికులు నిరసనకు దిగారు. పరిస్థితిని అదుపు ..మిగతా 2లో

## వర్షాలపై సీఎం రేవంత్
# అత్యవసర సమీక్ష

మొదటి పేజీ తరువాయి...

వారు వెంటనే రద్దు చేసుకొని వెంటనే పనుల్లో నిమగ్నం కావాలని సీఎం ఆదేశించారు. అత్యవసర విభాగాల అధికారులు క్షేత్ర స్థాయిలో అంటూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని సీఎంఓ కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. వరద ఎఫెక్ట్ ఏరియాల్లో తక్షణ సహాయం కోసం చర్యలు చేపట్టాలని సీఎం నిర్దేశించారు. అత్యవసర పని అనుకుంటే తప్ప ప్రజలు బయటకి రావొద్దని ప్రజలకు సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ఏ అవసరం ఉన్నా అధికారులకు ఫోన్లో సమాచారం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ సూచించారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్థానికంగా ఉంటూ సహాయక కార్యక్రమాలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. 24 గంటలు అలెర్ట్ గా ఉంటూ సహాయ కార్యక్రమాల్లో భాగంగా కావాలని సీఎం కాంగ్రెస్ కార్యకర్తలకు సూచించారు.

## పశ్చిమ బెంగాల్‌లో
# ఆగని దారుణాలు

మొదటి పేజీ తరువాయి...

చేసేందుకు ఆర్ ఏఎఫ్ బలగాలు రంగంలోకి దిగాయి. ఈ సమయంలో టియర్ గ్యాస్ షెల్స్ కూడా ప్రయోగించారు. నిందితుడు తమ గ్రామానికి చెందిన వాడని బాధితురాలి తండ్రి తెలిపారు. అతను ఇలా చేస్తాడని తాను ఊహించలేదన్నారు. తన కుమార్తెకు తొమ్మిదేళ్లు. ఆమె ఇంటి నుండి మా దుకాణానికి వచ్చింది. ఆ సమయంలో నిందితుడు ఆమెను లైంగికంగా వేధించాడు. అతనికి కఠిన శిక్ష వేయాలని డిమాండ్ చేస్తున్నానని అన్నారు. మరో ఘటనలో బీర్భూమ్ జిల్లాలోని ఇల్లంబజార్ ప్రాంతంలోని ఓ ఆస్పత్రిలో నర్సుపై వేధింపులకు పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. తన డ్యూటీలో భాగంగా ఆమె రోగులను పరీక్షిస్తుండగా, ఓ రోగి ఆమెను అనుచితంగా తాకాడని ఆ నర్సు ఆరోపించింది. దీనిని ఆమె వ్యతిరేకించడంతో నిందితుడు ఆ నర్సును దుర్భాషలాడాడు. నర్సు ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

## విద్యుత్ శాఖలో 3 వేల ఉద్యోగాలకు
# వచ్చే నెలలో నోటిఫికేషన్

మొదటి పేజీ తరువాయి...

యాజమాన్యాలు సేకరిస్తున్నాయి. ఇటీవల విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు, ట్రాన్స్‌కోలలో పెద్దఎత్తున పదోన్నతులు కల్పించిన సంగతి తెలిసిందే. జెన్‌కోలో ఇంకా మరికొందరికి ఇవ్వవల్సి ఉంది. ఈ పదోన్నతులతో కిందిస్థాయిలో 3 వేలకు పైగా ఖాళీలు ఏర్పడే అవకాశం ఉన్నట్లు తేలింది. వీటన్నింటినీ నేరుగా నియామకాల ద్వారా భర్తీ చేయనున్నారు. డిస్కంలలో కిందిస్థాయిలో అసిస్టెంటు లైన్‌మెన్, జూనియర్ లైన్‌మెన్, సబ్ ఇంజినీర్లు, సహాయ ఇంజినీరుతోపాటు ఇతర విభాగాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక ట్రాన్స్‌కో, జెన్‌కోలలో అసిస్టెంట్ ఇంజినీరు పోస్టులు కూడా భర్తీ చేయాల్సి ఉంది. ఇదిలా ఉంటే జెన్‌కోలో పదోన్నతులపై వివాదం నెలకొంది. మరో రెండు నెలల్లో యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి ప్రారంభం కానుంది. దీనికి అవసరమైన అసిస్టెంట్ డివిజినల్ ఇంజినీరు (ఏడీఈ), డివిజినల్, పర్యవేక్షక ఇంజినీరు పోస్టులను సైతం పదోన్నతుల ద్వారా భర్తీ చేయబోతున్నారు. వీటితో కిందిస్థాయిలో భారీగా అసిస్టెంట్ ఇంజినీరు పోస్టులు ఖాళీ అవుతాయి. ఏడేళ్ల క్రితం భద్రాద్రి, యాదాద్రి విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి అవసరమైన పోస్టులన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. యాదాద్రిలో విద్యుదుత్పత్తి ప్రారంభం కాబోతున్నందున పైస్థాయి పోస్టుల భర్తీకి పదోన్నతులు ఇప్పుడే ఇవ్వాలని విద్యుత్ ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. ఉత్పత్తి ప్రారంభమయ్యాకే ఇస్తామని జెన్‌కో యాజమాన్యం చెబుతోంది. దీంతో పదోన్నతుల విషయంలో తాడో పేడో ఇప్పట్లో తేలేలా కనిపించడం లేదు. పెగడపల్లిలో సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్వహణను జెన్‌కోకు అప్పగిస్తారని దానికి అవసరమైన పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ ఈ నిర్వహణ పనులను టెండరులో ఓ ప్రైవేటు సంస్థ దక్కించుకుంది. దీంతో ఈ పోస్టులు కూడా ఖాళీ అయ్యాయి. వాటిని కూడా పదోన్నతుల ద్వారా నింపేసి భద్రాద్రి, యాదాద్రి విద్యుత్ కేంద్రాల్లో ఉపయోగించుకోవాలని సంఘాలు కోరుతున్నాయి. దీనివల్ల పోస్టులు పెరిగి, ఆర్థికభారం పెరుగుతుందని యాజమాన్యం ఆపివేసింది. ఈ వివాదం తేలితేనే మొత్తం ఖాళీ పోస్టులపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

## బంగ్లాదేశ్‌లో హిందూ ఉపాధ్యాయుల
# బలవంతపు రాజీనామాలు

మొదటి పేజీ తరువాయి...

వెంటనే విధుల నుంచి తప్పుకున్నారు. ఓ తెల్ల కాగితంపైన I Resign అని రాసి సంతకం పెట్టారు. ఆ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆగస్టు 18వ తేదీన ఇదే విధంగా పలు కాలేజ్‌ల ఎదుట ఆందోళనలు జరిగాయి. అక్కడి లెక్చరర్‌లూ రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈ పరిస్థితుల్లో బంగ్లాదేశ్ నుంచి పారిపోవడం తప్పించి మరే గత్యంతరమూ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు హిందూ ఉపాధ్యాయులు. ఒత్తిడి చేసి విధుల నుంచి తప్పిస్తున్నారని అంటున్నారు. అంతే కాదు. హిందువులు కనిపిస్తేనే శత్రువులుగా చూస్తున్నారని చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితులు ఏమీ బాగోలేవని, ఏం చేయాలో అర్థం కావడం లేదని వివరిస్తున్నారు. ఈ సంక్షోభంపై బంగ్లాదేశ్ రచయిత్రి తస్లీమా నస్రీన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మైనార్టీల హక్కులను కాపాడడంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు. నెల రోజులకు పైగా బంగ్లాదేశ్ అట్టుడుకుతోంది. రిజర్వేషన్ కోటా విషయమై అంతంత మాత్రంగా మొదలైన ఆందోళనలు రానురాను తీవ్రమయ్యాయి. ప్రభుత్వంపై విద్యార్థులు తిరగబడ్డారు. ప్రధాని షేక్ హసీనా ఇంటిపైన, పార్లమెంట్‌పైనా దాడులు చేశారు. చేసేదేమీ లేక షేక్ హసీనా వెంటనే ప్రధాని పదవికి రాజీనామా చేశారు. ఆ తరవాత అక్కడి నుంచి భారత్‌కి వచ్చారు. భారత్ ఆమెకి ఆశ్రయం ఇచ్చేందుకు అంగీకరించలేదు. ప్రస్తుతానికి ఆమె ఢిల్లీలోనే ఉన్నారు. ఇక్కడి నుంచి మళ్లీ అమెరికాకి వెళ్తారని అనుకున్నా ఆ దేశం ఆమె వీసాని రద్దు చేసింది. ఫలితంగా భారత్‌లోనే ఉండిపోయారు షేక్ హసీనా. బంగ్లాదేశ్‌లో ఎన్నికలు ప్రకటించిన వెంటనే అక్కడికి వెళ్లిపోతారని ఆమె కుమారుడు వెల్లడించారు.

## భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**బిఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు కార్తీక్ రెడ్డి.**

**వరద ప్రభావిత ప్రాంతాల్లో వెను వెంటనే సహాయక చర్యలు చేపట్టాలి... కార్తీక్ రెడ్డి.**



కార్తీక్ రెడ్డి. బిఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇన్చార్జి

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 1, ( ప్రభాత ఉదయం) గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ... అయితే అల్పపీడనం కారణంగా రానున్న మరో రెండు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశము ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో..... రంగారెడ్డి జిల్లాతో పాటు రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు, ఆ పార్టీ రాజేంద్రనగర్ ఇన్చార్జి పట్లోళ్ల కార్తిక్ రెడ్డి ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజా ప్రతినిధులు అందుబాటులో ఉండి వరద ప్రభావిత ప్రజలకు సహాయం చేయాలని సూచించారు. నియోజకవర్గ ప్రజలు అత్యవసరం అయితే తప్ప ప్రయాణాలు చేయవద్దని కోరారు. లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజలకు కావాల్సిన ఏర్పాట్లను సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలకు ఏదైనా ఇబ్బందులు ఉంటే స్థానిక అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. సంబంధిత వరద ప్రభావిత ప్రాంతాల్లో వెనువెంటనే సహాయ సహకారాలు కోరారు. ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితిని అంచనా వేసి ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేయడం జరిగినదని కార్తీక్ రెడ్డి తెలిపారు.

## తెలంగాణలో భారీ వర్షాలు

మొదటి పేజీ తరువాయి...

చెందిన టీచర్ వెంకటేశ్వర్లు శనివారం రాత్రి బైకుపై ఇంటికి వెళ్తూ వరదలో గల్లంతయ్యారు. ఆయన మృతదేహం ఇవాళ వరద నీటిలో లభ్యమైంది. పెద్దపల్లి జిల్లాలో మల్యాల వాగులో ఇద్దరు గల్లంతు : పెద్దపల్లి జిల్లాలో మల్యాల వాగులో ఇద్దరు గల్లంతు అయ్యారు. కాల్వశ్రీరాంపూర్ మండలం మల్యాల వద్ద వాగు దాటుతూ ఈ ఇద్దరు గల్లంతైయ్యారు. వాగులో కొట్టుకుపోతూ చెట్టుని ఒక యువకుడు పట్టుకున్నాడు. ఆ యువకుడిని కాపాడేందుకు స్థానికులు యత్నించారు. గల్లంతైన మరో యువకుడి కోసం రెస్క్యూ టీం గాలిస్తోంది. వాగులో గల్లంతైన వ్యక్తి మీర్జంపేట పంచాయతీ బిల్ కలెక్టర్. 250 మందిని అగ్నిమాపక, విపత్తు నిర్వహణ : ఉమ్మడి వరంగల్, నల్గొండ జిల్లాల్లో వరద సహాయక చర్యలు ప్రారంభమయ్యాయి. అగ్నిమాపక, విపత్తు నిర్వహణ సిబ్బంది సహాయక చర్యలు ముమ్మరం చేశారు. కోదాడలో ముంపు బాధితులను బోట్ల సాయంతో సిబ్బంది కాపాడారు. మహబూబాబాద్ జిల్లా సీతారాం తండాలో వరద బాధితులను అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. పలు చోట్ల 250 మందిని అగ్నిమాపక, విపత్తు నిర్వహణ సిబ్బంది కాపాడారు.

## మూడు నెలల్లో వందే భారత్
# స్లీపర్ కోచ్ సేవలు

మొదటి పేజీ తరువాయి...

తర్వాత వందే భారత్ స్లీపర్ కోచ్‌ల కోసం చాలా శ్రమించామన్నారు. కొత్త రైలు రూపకల్పన చాలా క్లిష్టమైన పని అని, వందే భారత్ స్లీపర్ కార్లలో అనేక కొత్త ఫీచర్లను ప్రవేశపెట్టినట్లు మంత్రి తెలిపారు. వీటి తయారీ ఇటీవలే పూర్తయిందని, పది రోజుల పాటు కఠిన పరీక్షలు, ట్రయల్ రన్స్ నిర్వహిస్తామని వైష్ణవ్ తెలిపారు. రానున్న మూడు నెలల్లో వందే భారత్ స్లీపర్ కోచ్ సేవలను ప్రయాణికులకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. వందే భారత్‌లో నాసిరకం ఆహార పదార్థాల ఫిర్యాదులపై మంత్రి మాట్లాడుతూ, భారతీయ రైల్వే రోజుకు 13 లక్షల భోజనాన్ని అందిస్తోందని, ఫిర్యాదులు చాలా తక్కువగానే ఉన్నాయన్నారు. అయితే ఇప్పటికే అందిన ఫిర్యాదులపై ఆందోళన చెందుతున్నామని%ౌ% సంబంధిత క్యాటరర్లు, సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకున్నామని తెలిపారు. కాగా, బీఈఎంఎల్ ఆవరణలో ఏర్పాటు చేసిన వందేభారత్ తయారీ కేంద్రానికి మంత్రి శంకుస్థాపన చేశారు. బీఈఎంఎల్ కాంప్లెక్స్ సమీపంలో 9.2 ఎకరాల విస్తీర్ణంలో కొత్త హ్యాంగర్ సదుపాయానికి వైష్ణవ్ శంకుస్థాపన చేశారు.



హిమాయత్ సాగర్ జలాశయం వద్ద వరదలు పరిశీలిస్తున్న జలమండలి ఎండి అశోక్ రెడ్డి, సిజిఎం రవీందర్ రెడ్డి

## హిమాయత్ సాగర్‌ను సందర్శించిన జలమండలి ఎండి అశోక్ రెడ్డి

**వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**జంట జలాశయాల వద్ద ప్రత్యేక పర్యవేక్షణ**

హైదరాబాద్, సెప్టెంబరు 1(ప్రభాత ఉదయం) గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జంట జలాశయాలకు భారీగా వరదలు వస్తుందని జలమండలి ఎం డి అశోక్ రెడ్డి తెలిపారు. ఆదివారం హిమాయత్ సాగర్ చెరువును జలమండలి ట్రాన్స్మిషన్ సిజిఎం రవీందర్ రెడ్డి, హిమాయత్ సాగర్ డీజీఎం గోవింద్ గౌడ్, గండిపేట్ జలాశయం డీజీఎం నరహరి, అధికారులు కలిసి ఆయన సందర్శించి నీటి లెవెల్ ను పరిశీలించి వర్షాలకు ఎంత వరద వస్తుంది అని అధికారం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జలమండలి ఎండి అశోక్ రెడ్డి మాట్లాడుతూ... ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు రెండున్నర అడుగులు నీటి లెవెల్ పెరిగిందని తెలిపారు. ప్రజలు అనారోగ్యాలకు గురికాకుండా శుద్ధి నీటిని అందించడంతోపాటు సరఫరాలో అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత నెల రోజులుగా కురుస్తున్న వర్షాలతో హైదరాబాద్ నగరానికి మంచినీటి కోసం తరలిస్తున్న కృష్ణ, గోదావరి నదులకు భారీ వరద నీరు చేరటంతో పాటు నగర శివారు జంట జలాశయాలలో వరద నీరు భారీగా వచ్చి చేరుతుందని దీంతో వచ్చే వేసవిలో మంచినీటి సమస్య ఉండదని అభిప్రాయపడ్డారు.



కొండ చిలువ

## హసన్ నగర్‌లో కొండ చిలువ కలకలం

బుద్వేల్, సెప్టెంబర్1(ప్రభాత ఉదయం): హసన్ నగర్ పాత ఐస్ ఫ్యాక్టరీ వద్ద శనివారం రాత్రి కొండచిలువ కలకలం రేపింది. ఐస్ ఫ్యాక్టరీ వద్ద కొండచిలువ కనపడడంతో స్థానికులు దాన్ని పట్టుకోవడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. పాములు పట్టే వ్యక్తులను పిలిపించి కొండచిలువను పట్టించారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



హసన్ నగర్‌లో కొండ చిలువ కలకలం



రెవరెండ్ ఏలీయా బాబు..



క్రైస్తవ గీతాలు ఆలపిస్తున్న యువత

## దేవుణ్ణి స్తుతించే వారిగా ఉండాలి

బుద్వేల్, సెప్టెంబర్1(ప్రభాత ఉదయం): క్రైస్తవులు అనుదినం, అనుక్షణం యేసయ్యను స్తుతించే వారిగా ఉండాలని శంషాబాద్ రాక్ చర్చ్ పాస్టర్ రెవరెండ్ ఏలీయా బాబు అన్నారు. రాజేంద్రనగర్ మన్నా చర్చిలో ఆదివారం జరిగిన ఆరాధన కార్యక్రమంలో ఆయన బైబిల్ సందేశాలను అందజేశారు. కీర్తనలు 150 వ అధ్యాయం ఒకటవ వచనంలో యెహోవాను స్తుతించుడి.. అని ఉందని ప్రతి ఒక్కరు రోజు ఆయనను స్తుతించాలన్నారు. దేవుణ్ణి స్తుతించే నోటితో అబద్దాలు ఆడవద్దని, ఇతరులను తిట్ట వద్దని తెలిపారు. యేసు ను నమ్మిన వారు మంచి అలవాట్లతో జీవించాలన్నారు. ఇతరులను దీవించే వారిగా ఉండాలన్నారు,

## సినిమాల్లోనే కాదు
# రాజకీయాల్లోనూ 'క్యాస్టింగ్ కౌచ్'

మొదటి పేజీ తరువాయి...

మాలీవుడ్ ను కుదిపేస్తుంది. ఈ కమిటీ ఏర్పడిన తర్వాత ఎంతోమంది నటీమణులు మీడియా ముందుకు వచ్చి తమకు ఎదురైన చేదు అనుభవాలు, వారి ఆవేదన పంచుకుంటున్నారు. ఈ పరిణామాల వేళ కేరళకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టిస్తున్నాయి. 'క్యాస్టింగ్ కౌచ్' అనేది సినీ ఇండస్ట్రీకే పరిమితం కాలేదని.. రాజకీయాల్లోనూ ఈ విపరీత పోకడ ఉందని తాను ఆరోపించారు.

**సిమిపై ఫిర్యాదు**

కేరళ కాంగ్రెస్ పార్టీలో క్యాస్టింగ్ కౌచ్ తరహా పరిస్థితులు ఉన్నాయంటు సీనియర్ నాయకురాలు సిమీ రోజ్ వెల్ జాన్ తీవ్ర ఆరోపణలు చేశారు. సిమి రోజ్‌బెల్ జాన్ ఆరోపణలపై రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధిష్టానానికి ఫిర్యాదు చేసింది. మీడియాతో ఆమె మాట్లాడుతూ.. చాలా మంది తమ చేదు అనుభవాల గురించి నాతో కథనాలను పంచుకున్నారు. తన వద్ద ఆధారాలు ఉన్నాయని, సరైన సమయం వచ్చినప్పుడు బయటపెడతానని చెప్పింది. కాంగ్రెస్ పార్టీలో చాలా మంది మహిళలు.. పురుష నేతల నుంచి అభ్యంతరకర ప్రవర్తనను ఎదుర్కొంటున్నారని తెలిపారు.

**పదవుల ఆశ జూపి..**

మహిళా నేతల పట్ల పదవుల ఆశ జూపి కొందరు సీనియర్ నేతలు వారి పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని రోజ్ బెల్ ఆరోపించారు. అంతేకాకుండా.. నాయకత్వంతో సన్నిహిత సంబంధాలు ఉన్నవారికే అవకాశాలు లభిస్తున్నాయని, తద్వారా కేరళ కాంగ్రెస్ విభాగంలో ఉన్నత స్థానాల్లో అర్హత లేని కొందరు మహిళలు ఉన్నారని అన్నారు. అయితే ఆమె ఆరోపణలు పార్టీలో అంతర్గత విభేదాలకు దారితీశాయి. ఆమెపై రాష్ట్ర మహిళా కాంగ్రెస్ విభాగం పార్టీ హైకమాండ్‌కు ఫిర్యాదు చేసింది.

# ఆగస్టులో జీఎస్టీ వసూళ్లు 1.75 లక్షల కోట్లు




దిల్లీ: సెప్టెంబర్ 1 (ప్రభాత ఉదయం): దేశంలో గత నెలకు సంబంధించిన వస్తు, సేవల పన్ను వసూళ్ల వివరాలను కేంద్రం వెల్లడించింది. ఆగస్టు మాసానికి రూ.1.75 లక్షల కోట్లు వసూళ్లు జరిగినట్లు పేర్కొంది. గతేడాది ఇదే నెలలో రూ.1.59 లక్షల కోట్ల వసూళ్లు నమోదవ్వగా.. అప్పటితో పోలిస్తే ఈసారి 10 శాతం మేర పెరగడం గమనార్హం. జులై మాసంలో రూ.1.82లక్షల కోట్ల మేర జీఎస్టీ వసూళ్లు వచ్చాయని తెలిపింది. ఆగస్టులో దేశీయ వ్యాపార కార్యకలాపాల ద్వారా స్థూల జీఎస్‌టీ వసూళ్లు 9.2శాతం పెరిగి రూ.1.25 లక్షల కోట్లకు చేరాయి. దిగుమతుల ద్వారా జీఎస్‌టీ ఆదాయం 12.1శాతం మేర పెరగడంతో రూ.49,976 కోట్లకు చేరింది. ఆగస్టులో రూ.24,460 కోట్ల విలువైన రీఫండ్‌లు జారీ అయ్యాయనీ.. గతేడాదితో పోలిస్తే ఇది 38 శాతం పెరుగుదల నమోదైనట్లు పేర్కొంది.

## తెలంగాణలో రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్

**భారీ వర్షాల్లో రెస్క్యూ ఆపరేషన్స్**

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత ఉదయం): భారీ వర్షాల వేళ తెలంగాణలో ఎన్డీఆర్ఎఫ్ రంగంలోకి దిగింది. రాష్ట్రంలో భారీ వర్షాలు, ఖమ్మం జిల్లా పరిస్థితిపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా దృష్టికి బండి సంజయ్ తీసుకెళ్లారు. ఖమ్మం జిల్లాలో 110 గ్రామాలు ముంపునకు గురవడంతోపాటు పట్టణంలోని ప్రకాశ్ నగర్ గుట్టపై 9 మంది, పాలేరు నియోజకవర్గంలోని అజ్మీరాతండ గుట్టపైన 68 మంది, బిల్డింగులపైన 42 మంది చిక్కుకున్న విషయాన్ని బండి సంజయ్ అమిత్ షాకు వివరించారు. తెలంగాణలో ప్రాణ నష్టం లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఎన్డీఆర్ఎఫ్ ను అమిత్ షా ఆదేశించారు. చెన్నై, వైజాగ్, అసోం నుండి 3 చొప్పున మొత్తం 9 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అమిత్ షా తెలంగాణకు పంపారు. ఎన్డీఆర్ఎఫ్ ఉన్నతాధికారులతో బండి సంజయ్ మాట్లాడారు. రాష్ట్ర అధికారులతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపట్టాలని ఎన్డీఆర్ఎఫ్ బృందాలకు బండి సంజయ్ సూచించారు.

**రాష్ట్ర వ్యాప్తంగా చాలా చోట్ల జలదిగ్బంధం**

వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని వెంకటాపురం గ్రామ సమీపంలో ఆర్టీసీ బస్సులో ఉన్న ప్రయాణికులు వరద ఉధృతిలో చిక్కుకొగా.. సంఘటన స్థలానికి చేరుకున్న జిల్లా కలెక్టర్, అధికారులు, పోలీసులు లారీ సహాయంతో ప్రయాణికులు సురక్షితంగా వాగు దాటారు.

**ఈ గ్రామాలకు రాకపోకలు బంద్**

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కొందుర్గు మండలం లో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భారీవర్షాల కారణంగా వెంకిర్యాల,గంగన్నగూడ, విశ్వనాథ్ పూర్ గ్రామాల వాగులు పొంగి పొర్లడం తో రోడ్లు కొట్టుకునిపోయి గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి.

## గ్రామీణ యువతకు అందుబాటులో వ్యవసాయ శిక్షణ కార్యక్రమాలు

**నార్మ్ 49వ వ్యవస్థాపక దినోత్సవంలో**

**ఐ సీ ఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్ సి అగర్వాల్**



నార్మ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు



అవార్డుల ప్రదానోత్సవం

బుద్వేల్, సెప్టెంబర్1(ప్రభాత ఉదయం) : వ్యవసాయ విద్యకు సంబంధించిన వివిధ శిక్షణా కార్యక్రమాలు గ్రామీణ యువతకు చేరువయ్యేలా భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐ సీ ఏ ఆర్) ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతున్నదని ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ( ఎడ్యుకేషన్) డాక్టర్ ఆర్ సి అగర్వాల్ అభిప్రాయపడ్డారు. రాజేంద్రనగర్ లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్మెంట్ (నార్మ్) 49వ వ్యవస్థాపక దినోత్సవం వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ఆర్ సి అగర్వాల్ మాట్లాడుతూ, వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన విద్య, శిక్షణ కార్యక్రమాలను గ్రామీణ యువతకు చేదవేయడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. శిక్షణ ఇవ్వడమే కాకుండా గ్రామీణ యువతను వ్యాపార రంగంలో ప్రోత్సహించడానికి అన్ని విధాల ప్రయత్నిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా యువతకు వ్యవసాయ శిక్షణా కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా హాజరైన వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎ. పద్మరాజు మాట్లాడుతూ, వ్యవసాయ డిప్లొమా కోర్సులను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. వ్యవసాయ డిప్లొమా కోర్సుల వల్ల విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలతో పాటు స్వయం ఉపాధి పొందుకోవడానికి కూడా మార్గం సుగమమవుతుందన్నారు. తద్వారా రైతులకు ఆదాయ ఉత్పత్తిని పెంచే విధంగా ఉంటుందన్నారు . సానుకూల ఆలోచనలతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. పరిశోధన నిర్వహణలో రాజేంద్రనగర్ లోని నార్మ్ దేశంలోనే అత్యున్నత స్థానంలో సేవలందిస్తున్నదని కొనియాడారు. వ్యవసాయ రంగంలో ఉన్నటువంటి శాస్త్రవేత్తలను , అధికారులను తీర్చిదిద్దడానికి నార్మ్ చేస్తున్న కృషి ఎంతో గొప్పదన్నారు. నార్మ్ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్ రావు అధ్యక్షోపన్యాసం చేస్తూ, నార్మ్ ద్వారా విద్య , పరిశోధన, శిక్షణ, నిర్వాహణ కార్యక్రమాలను ఇస్తూ అనేకమంది యువ శాస్త్రవేత్తలను వ్యవసాయ రంగానికి తోడ్పడే విధంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. నార్మల్ వ్యవసాయ శాస్త్రవేత్తలకు ఇస్తున్న ఫౌండేషన్ కోర్స్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఏ-ఐడియా ద్వారా భారత దేశ వ్యాప్తంగా 321 స్టార్టప్ లకు సహకారాన్ని అందిస్తున్నామన్నారు. ప్రయివేటు వ్యవసాయ విశ్వవిద్యాలయంతో సహా 56 ఐసీఏఆర్ ఇనిస్టిట్యూట్ లతో అవగాహన ఒప్పందాలను కుదుర్చుకుని ముందుకు సాగుతున్నామన్నారు. నార్మ్ థింక్ ట్యాంక్ పాలసీ ఇనిస్టిట్యూట్ గా గుర్తింపు పొంది దేశంలోని జాతీయ వ్యవసాయ అనుబంధ సంస్థలకు దిశా నిర్దేశం చేయడంలో ముందుండి పనిచేస్తుందన్నారు. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నాలుగు ప్రచురణలను విడుదల చేశారు . బెస్ట్ ఇన్నోవేటివ్ రైతులు, బెస్ట్ స్టార్టప్ అవార్డులు, బెస్ట్ ప్రింట్ మీడియా , బెస్ట్ పిజి స్టూడెంట్ లకు ముఖ్య అతిథి అవార్డులను అందజేశారు. బాగా పనిచేసిన ఉద్యోగులకు, టెక్నికల్ కేటగిరీలో, పరిపాలన విభాగంలో అవార్డులను అందజేశారు . కార్యక్రమంలో నార్మ్ ఇంచార్జ్ జాయింట్ డైరెక్టర్ వి రమ సుబ్రహ్మణ్యం, వందన సమర్పణ చేశారు కార్యక్రమంలో వివేక్ పూర్వర్, జాకీర్ కిల్జీ తో పాటు ఉద్యోగులు, శాస్త్రవేత్తలు సిబ్బంది పాల్గొన్నారు.

# ఉదయాన్నే రోడ్ల మీదికి జీహెచ్ఎంసీ అధికారులు



హసన్ నగర్‌లో పారిశుద్ధ్య సిబ్బంది తో మాట్లాడుతున్న గ్రేటర్ దక్షిణ మండలం జోనల్ కమిషనర్ వెంకన్న, డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్



ఉప్పర్ పల్లి పిల్లర్ నెంబర్ 190 వద్ద వరద నీరు డ్రైన్ లోకి వెళ్ళేటట్లు చేస్తున్న సిబ్బంది



ఉప్పర్ పల్లిలో వరద సహాయక చర్యలను పరిశీలిస్తున్న రాజేంద్రనగర్ ఈ ఈ నరేందర్ గౌడ్

బుద్వేల్, సెప్టెంబర్1(ప్రభాత ఉదయం) : శనివారం నుంచి కురుస్తున్న వర్షాలకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండడానికి రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో జీహెచ్ఎంసీ అధికారులు ఆదివారం ఉదయాన్నే రోడ్ల పైకి వచ్చి సహాయక చర్యలను పర్యవేక్షించారు. గ్రేటర్ దక్షిణ మండలం జోనల్ కమిషనర్ వెంకన్న , రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్ , ఈఈ నరేందర్ గౌడ్ , సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డిప్యూటీ ఈ ఈ శ్రీనివాస్ తో పాటు సిబ్బంది మొత్తం రోడ్లపైకి వచ్చి నీరు ఉన్న ప్రాంతాలలో సహాయక చర్యలు చేపట్టారు. పరిసరాలను శుభ్రం చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కయ్యుమ్ నగర్ లో శిథిలావస్థకు చేరుకున్న ఇంటికి తాళం వేసి అందులో ఉన్న వారిని బంధువుల ఇంటికి పంపించారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు కలకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. మూసి పరివాహక ప్రాంతంలో హైదరీ ఎన్క్లేవ్ లో నివాసముంటున్న ఇండ్ల వద్దకు వెళ్లి ఎప్పుడైనా హిమాయత్ సాగర్ జలాశయం గేట్లు ఎత్తే ప్రమాదం ఉందని, ఇండ్లు ఖాళీ చేయాలని సూచించారు.



కయ్యుమ్ నగర్‌లో శిథిలావస్థకు చేరుకున్న ఇంటికి తాళం వేస్తున్న మున్సిపల్ సిబ్బంది



మూసీ నది పరివాహక ప్రాంతమైన హైదరీ ఎంక్లేవ్ లో ఉన్న వారికి ఇల్లు కాళీ చేయమని చెబుతున్న మున్సిపల్ సిబ్బంది



ఏ ఆర్ ఐ గేటు ముందు గల ధర్నా చౌక్ వద్ద పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

బుద్వేల్, సెప్టెంబర్1(ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ పిలుపుమేరకు రాజేంద్రనగర్ జేఏసీ ఇన్చార్జి ఎం శ్రీనివాస్ యాదవ్ అధ్వర్యంలో ఆదివారం ఉద్యోగులు రాజేంద్రనగర్ ఏ ఆర్ ఐ ధర్నా చౌక్ దగ్గర పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, వెటర్నరీ, ఉద్యాన యూనివర్సిటీలతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు. ఉద్యోగ నాయకులు, రాజేంద్రనగర్ తాలూకా జేఏసీ మాజీ చైర్మన్ ఎం ఎ నయీమ్, కో చైర్మన్ ఎస్. యాదయ్య ముదిరాజ్ పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ యూనివర్సిటీ జనరల్ సెక్రటరీ ఎస్ అమృత్ రెడ్డి , డాక్టర్ జె. సురేష్ , వెటర్నరీ యూనివర్సిటీ అధ్యక్షుడు మహమ్మద్ షర్ఫుద్దీన్, బిక్షపతి, రమేష్ , జ్ఞానేశ్వర్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు జి. అంజయ్య గౌడ్ , నాగులు యాదవ్ ఔట్ సోర్సింగ్ యూనియన్ నాయకులు జహంగీర్ లు ఈ కార్యక్రమంలో పాల్గొని పెన్షన్ విద్రోహ దినంగా నిరసన వ్యక్తం చేయడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగస్తులకు బాకీ ఉన్న ఐదు డీఏ లలో నాలుగు తక్షణమే విడుదల చేస్తూ పీఆర్ సీ కమిటీలు ఏర్పాటు చేసి అడుగులు వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది.



బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులతో కార్తిక్ రెడ్డి

## నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై యువత పోరాడాలి: కార్తీక్ రెడ్డీ

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 1, ( ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ నియోజకవర్గం లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నాయకులు కృషి చేయాలని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు, రాజేంద్రనగర్ నియోజకవర్గం ఆ పార్టీ ఇన్చార్జి కార్తీక్ రెడ్డి సూచించారు. ఆదివారం రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని నెక్నాంపూర్, మణికొండ మున్సిపాలిటీకి చెందిన, యువజన విభాగం నాయకులు, సోషల్ మీడియా వింగ్ తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు కార్తీక్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ.... ప్రస్తుతం భారీ ఎత్తున వర్షాలు కురుస్తుండటంతో... ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజల ఇబ్బందులను, వరద ప్రభావిత ప్రాంతాలను ఎప్పటికప్పుడు యువత తమ సోషల్ మీడియాతో అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజా సమస్యలు పట్టని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను నియోజకవర్గంలో అడుగడుగునా నిలదీయాలని అన్నారు. రానున్న కాలం లో టిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం కు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు.

## తమ ఇంట్లో నుంచి చోరీకి గురైన బంగారాన్ని ఇప్పించండి

రాజేంద్రనగర్, సెప్టెంబర్1(ప్రభాత ఉదయం): పట్టపగలే ఓ ఇంట్లోని పూజ గదిలో ఉన్న బంగారాన్ని దొంగలించారు దుండగులు. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఇంట్లోకి చొరబడి పూజ గదిలో ఉన్న బంగారు అభరణాలను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన అత్తాపూర్ డివిజన్‌లోని హైదర్‌గూడ గుమ్మకొండ కాలనీలో చోటు చేసుకుంది. గుమ్మకొండ కాలనీకి చెందిన ఎల్. ధనుంజయ్ గౌడ్, సులోచన దంపతులు. 10 ఏళ్ల నుంచి జనప్రియ చౌరస్తాలో పూలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. నిరుపేద కుటుంబం అయిన ధనుంజయ్ ఫ్యామిలీ ఎంతో కష్టపడి కూతురు పెళ్లి కోసం కూడబెట్టిన డబ్బుతో 12 తులాల బంగారు కొన్నారు. ఆగస్టు 19న సాయంత్రం 6 గంటలకు పూజ చేయడం కోసం ఇంట్లో ఉన్న బంగారు వస్తువులను టిఫిన్ బాక్స్‌లో వేసి పూజగదిలో పెట్టారు. అదే టిఫిన్ బాక్సులో వెండి వస్తువులను కూడా పెట్టారు. మళ్లీ ఆగస్టు 28న ఉదయం 10 గంటలకు పూజగదిలోని టిఫిన్ బాక్సులో ఉన్న బంగారు వస్తువులను తీసేందుకు టిఫిన్ బాక్సును ఓపెన్ చేసారు. అందులో బంగారు ఆభరణాలు కనిపించలేదు. వెండి వస్తువులు మాత్రం అలాగే ఉండగా.. బంగారు ఆభరణాలను మాత్రమే గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. అందులో ఉన్న 2.36 గ్రాముల బంగారు చైన్, 2.5 గ్రాముల బంగారు చెవికమ్మలు, 2.10 గ్రాముల బంగారు రింగులు, 2.60 గ్రాముల బంగారు బిస్కెట్లు మొత్తం కలిపి 12 తులాల బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. పట్టపగలే ఇంట్లోకి దొంగలు చొరబడి బంగారాన్ని దొంగలించడంతో స్థానికంగా కలకలం సృష్టించింది. స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. బంగారం దొంగతనానికి గురయిందని తెలియగానే బాధితులు వెంటనే రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేశారు. దీంతో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ విజయ్ వాళ్ల ఫిర్యాదుకు స్పందించి చోరీ అయిన ఇంటిని తనిఖీ చేసి ఎఫ్ఐఆర్ నెంబర్ 849/2024 ద్వారా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రోజూ పూలు అమ్మి జీవనం సాగించే నిరుపేద కుటుంబానికి చెందిన బంగారు ఆభరణాలను త్వరగా రికవరీ చేసి బాధితులకు అందజేయాలని పోలీసులను బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు కోరుతున్నారు.



ఉప్పరపల్లి వద్ద విద్యుత్ సమస్యను పరిశీలిస్తున్న ఎస్ ఈ శ్రీరామ్ మోహన్, డి ఈ రత్నాకర్ రావు

## విద్యుత్ సరఫరా లో ఎలాంటి సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం: ఎస్ ఈ శ్రీరామ్ మోహన్

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 1(ప్రభాత ఉదయం) గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెట్ల కొమ్మలు విరిగిపోవడం విద్యుత్ వైర్ల లో చిన్న చిన్న సమస్యలు వచ్చినప్పటికీ విద్యుత్ సరఫరా లో ఎలాంటి విద్యుత్ సరఫరా లో ఇబ్బంది లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ ఇ డి శ్రీరామ్ మోహన్ తెలిపారు. ఆదివారం రాజేంద్రనగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలోగల ఉప్పరపల్లి బాంబే కాలనీలో డివిజనల్ ఇంజనీర్ రత్నాకర్ రావు, ఏ డి ఈ సత్యనారాయణ, అసిస్టెంట్ ఇంజనీర్ హాతిరాం లతో కలిసి క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా సమస్యలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ ఈ రామ్మోహన్ మాట్లాడుతూ... ప్రజలు చెట్ల వద్ద గల స్తంభాల వద్ద వర్షం వచ్చినప్పుడు నిలిచి ఉండకూడదని సూచించారు. తమ ప్రాంతాలలో ప్రజలు ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని వాటిని అధికారులు క్షేత్రస్థాయిలో వెంటనే పరిశీలించి పరిష్కరిస్తారని అన్నారు.





## అప్ప చెరువులో కూల్చి వేసిన షెడ్లు

### గగన్ పహాడ్ అప్ప చెరువు లో 14 షెడ్లు కూల్చివేత

బుద్వేల్, సెప్టెంబర్ 1 (ప్రభాత ఉదయం): గగన్ పహాడ్ అప్ప చెరువు ఎఫ్ టి ఎల్ పరిధిలో వెలసిన 14 షెడ్లను హైడ్రా అధికారులు శనివారం రాత్రి వరకు పూర్తిగా నేలమట్టం చేశారు. గగన్ పహాడ్ సర్వేనెంబర్ 89, 90లో విస్తరించి ఉన్న అప్ప చెరువు ఎఫ్ టి ఎల్ లో అక్రమణలు ఉన్నాయని స్థానికులు హైడ్రా అధికాదుల దృష్టికి తీసుకురావడంతో అధికారులు శనివారం ఉదయం అప్ప చెరువులో కూల్చివేతలు ప్రారంభించారు. సాయంత్రానికి ఆరు షెడ్లు మాత్రమే కూల్చిన అధికారులు రాత్రి వరకు మొత్తం 14 పరిశ్రమలకు నేలమట్టం చేశారు . ఒక్కొక్క షెడ్డు 1000 గజాల చొప్పున ఉండడంతో హైడ్రా అదికారులకు కూల్చడానికి సమయం పట్టింది . ఎఫ్.టి.ఎల్ ప్రాంతంలో పెద్దగా ఉన్న నిర్మాణాన్ని కూడా నేలమట్టం చేశారు.

## అప్ప చెరువు కింది భాగంలో కట్టిన ప్రహరీ గోడను కూల్చివేయాలి

### రైలు పట్టాల కింద నీళ్లు ప్రవహించే ప్రాంతంలో అడ్డులు తొలగించాలి.. చెరువులో వేసిన వ్యర్థాలను తీసివేయాలి : బీజేవైఎం రాజేంద్రనగర్ నియోజకవర్గ కన్వీనర్ సూరెడ్డి వినయ్ రెడ్డి డిమాండ్

బుద్వేల్, సెప్టెంబర్1(ప్రభాత ఉదయం): గగన్ పహాడ్ అప్ప చెరువు కింది భాగంలో నీరు పెద్ద చెరువుకు వెళ్లకుండా అడ్డుగా కట్టిన ప్రహరీ గోడను కూల్చివేయాలని బీజేవైఎం రాజేంద్రనగర్ నియోజక వర్గం కన్వీనర్ సూరెడ్డి వినయ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ప్రభాత ఉదయంతో మాట్లాడుతూ, అప్ప చెరువు కింది భాగం లో ప్రైవేట్ వ్యక్తులు చెరువు నీరు కిందకు వెళ్లకుండా ప్రహరీ నిర్మాణం చేశాడని గుర్తు చేశారు. చెరువు నిండినప్పుడు వరదనీదు చెరువు కింది నుంచి పెద్ద చెరువులోకి వెళ్తుందని తెలిపారు. అలా వెళ్లకుండా నిర్మించిన ప్రహరీ ని తొలగించాలన్నారు. 2020 అక్టోబర్ 12వ తేదీ రాత్రి కురిసిన భారీ వర్షానికి అప్పచెరువు పూర్తిగా నిండిపోయి ప్రస్తుతం నిర్మించిన ప్రహరీ మీదుగా ప్రవహించగా ఫంక్షన్ హాల్ బయట పడుకున్న నలుగురు వర్షానికి కొట్టుకుపోయి మరణించారన్నారు. అదే ప్రాంతం గుండా వరద నీరు ప్రవహించి జాతీయ రహదారి పాడైందని, రోడ్డుపై నీరు ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతలాయం కలిగిందని గుర్తు చేశారు . అలాంటి చోట ప్రహరీ గోడ నిర్మాణం చేశారని, దానిని వెంటనే అధికారులు తొలగించాలని డిమాండ్ చేశారు. అధికారులు అప్ప చెరువుకు పాత తుములు ఉన్నచోట కాకుండా నూతనంగా కట్టిన నాలా వల్ల చెరువులో ఒక్క చుక్క నీరు కూడా లేకుండా పోతుందన్నారు . దీంతో చెరువు ఆనవాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అప్పచెరువు రైలు పట్టాల అవతలి వైపు ఇవతలి వైపు విస్తరించి ఉంటుందని, రైలు పట్టాల కింది భాగంలో చెరువులో నీరు అవతల నుంచి ఇవతలకు ప్రవహించడానికి ఉన్న నాలాకు అడ్డుకట్ట వేశారన్నారు. దానికి అడ్డంగా పోసిన మట్టిని, కట్టిన గోడను కూడా తొలగించాలన్నారు. అంతేకాకుండా అప్పచెరువులో పోసిన నిర్మాణ వ్యర్థాలను తొలగించి చెరువుకు పూర్వ వైభవం తీసుకురావాలని సూరెడ్డి వినయ్ రెడ్డి కోరారు.



అప్ప చెరువు క్రింది భాగంలో ప్రయివేటు వ్యక్తులు కట్టిన ప్రహరీ గోడ



బీజేవైఎం రాజేంద్రనగర్ నియోజకవర్గ కన్వీనర్ సూరెడ్డి వినయ్ రెడ్డి



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



బాబుల్ రెడ్డి నగర్‌లోని నల్ల పోచమ్మ దేవాలయం

## శ్రీ పోచమ్మ ఆలయంలో నేడు అన్నదాన కార్యక్రమం

### భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ పిలుపు

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 01( ప్రభాత ఉదయం): మైలార్ దేవుపల్లి డివిజన్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్ లో గల శ్రీ నల్ల పోచమ్మ దేవాలయంలో నేడు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. పోచమ్మ తల్లి ఆవరణలో ప్రతినెల అమావాస్య రోజున ఈ అన్నదాన కార్యక్రమం గత కొంతకాలంగా నిర్వహిస్తున్నామని.. నేడు జరిగే అన్నదాన వితరణ కార్యక్రమంలో బాబుల్ రెడ్డి నగర్ తో పాటు, చుట్టుపక్కల కాలనీలా భక్తుల అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అమావాస్య రోజున(నేడు ) ఆలయంలో ఉదయం సుప్రభాత సేవతో పాటు ప్రత్యేక పూజలు జరుగుతాయని, అమ్మవారికి మహా హారతి అనంతరం మధ్యాహ్నం (12.30 నిమిషాలకు) అన్నదాన కార్యక్రమం ప్రారంభమవుతుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### అన్నం పరబ్రహ్మ స్వరూపం...

సమస్త జీవకోటి మనుగడకు ఆహారం ఎంతో ముఖ్యమైనదని... అదేవిధంగా మానవజీవికి కూడ అన్నం పరాబ్రహ్మ స్వరూపం లాంటిదని అన్నదానం యొక్క విశేషాలు వివరిస్తూ... ఈ విధంగా తెలిపారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అన్నం లేనిది ఏ ప్రాణి జీవించలేదు. అన్నం ఎటువంటి లోటు లేకుండా దొరకడం అంటే సాక్షాత్తు ఆ కాశీ అన్నపూర్ణ అమ్మవారి అనుగ్రహం తప్పనిసరి కావాలని,అన్నదానం కోటి గోవుల దాన ఫలితంతో సమానమైనదని, ఏది లోపించినా బ్రతకగలం. కానీ ఆహారం లోపిస్తే బ్రతకలేమని "దానాలన్నింటిలోకెల్లా అన్నదానం మిన్న" అన్నదానాన్ని మించిన దానం మరొకటి లేదని పెద్దలు సూచించినట్లు, మనం చేసే దానంలో స్వార్థం లేకుండా ఏ ఫలితం ఆశించకుండా చేస్తే ఆ దేవుడే దానాన్ని గ్రహించడానికి వస్తాడని పురాణాలు తెలిపినట్లు, కర్ణుడు, బలిచక్రవర్తి మొదలైనవారి దగ్గరికి భగవంతుడే యాచకుడిగా వచ్చి దానం స్వీకరించి వారికి మోక్షాన్ని ప్రసాదించినట్టు పురాణ, ఇతిహాసాల ద్వార మనకు తెలుస్తుంది. అన్నదానం అంటేనే మనతో ఏ బంధం లేనివారు, నిరుపేదలను "(దరిద్ర నారాయణులు)" భగవంతునిగా భావించి చేసే మహత్కార్యం ఇది. అన్నదానం జరిగే చోటకు భగవంతుడు పేదవారిగా రూపం దాల్చి వస్తాడు అని పురాణ ఆధారాలున్నాయి. ఈ అన్నదాన కార్యాక్రమానికి ఏదో రకంగా సహాయపడిన ప్రతి ఒక్కరికి ఆ పుణ్యఫలం లభిస్తుందని, ఆకలి బాధ అనేది అందరికీ ఒకేలాగే ఉంటుంది కనుక సాటివారి ఆకలి తీరుద్దాం.... అన్నాన్ని గౌరవిద్దాం.. నలుగురిని ఆదరిద్దాం.. అనే నినాదంతో ప్రతి నెల అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## కల్లబొల్లి మాటలతోనే కాంగ్రెస్ కాలయాపన: సబితా ఇంద్రారెడ్డి







పార్టీలో చేరిన వారికి బిఆర్ఎస్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

### మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ.. కాంగ్రెస్ పార్టీని వీడి బిఆర్ఎస్ పార్టీలో చేరిన యువకులు. బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి.

మహేశ్వరం, సెప్టెంబర్ 1 ( ప్రభాత ఉదయం) కల్లబొల్లి మాటలతోనే రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు, మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం పై ధ్వజమెత్తారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం పరిధి జల్ పల్లి మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు, కార్యకర్తలు బిఆర్ఎస్ గూటికి చేరారు. జల్ పల్లి మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ హమీద్ షర్ఫుద్దీన్ మరియు సీనియర్ నాయకులు బదర్ ఆధ్వర్యంలో జిల్లెల గూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నాయకులకు, యువకులకు బిఆర్ఎస్ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.... గత తొమ్మిది నెలల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలతో మోసం చేస్తూ నెట్టుకొస్తుందని అన్నారు. ఆరు గ్యారెంటీల ఊసెత్తకుండా హైడ్రా పేరుతో హైప్ క్రియేట్ చేస్తుందని మండిపడ్డారు. మరోవైపు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని, అంటూ రోగాల భారీగా పడి ఆస్పత్రులకు బారులు తీరుతున్న ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్య వైఖరి వినడం లేదని ఆరోపించారు. తొమ్మిది నెలల కాలంలోనే రాష్ట్ర ప్రజలు, ప్రధానంగా యువత కాంగ్రెస్ ప్రభుత్వం పై తిరుగుబాటుకు సిద్ధమయ్యారని అన్నారు. నేడు మహేశ్వరం ఒక్క నియోజకవర్గమే కాదు, పక్కనే ఉన్న రాజేంద్రనగర్ తో పాటు రాష్ట్ర మొత్తం యువత బిఆర్ఎస్ పాలన కోరుకుంటున్నారని తెలిపారు. పార్టీలో చేరిన వారికి రానున్న కాలంలో మంచి భవిష్యత్తు ఉంటుందని, వారికి తగ్గ సముచితస్థానం కల్పిస్తామని సబితా రెడ్డి హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ,.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జల్పల్లి మున్సిపాలిటీలో ఒక్క అభివృద్ధి పని జరగలేదని అన్నారు. గతంలో సబితా ఇంద్రారెడ్డి చేసినటువంటి అభివృద్ధి తప్ప,, ప్రస్తుత పరిస్థితుల్లో మా యొక్క సమస్యలను పట్టించుకునే నాథుడే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఉండడం కన్నా అభివృద్ధి చేస్తున్న మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి వెంటే ఉంటే మాకు గౌరవం ఉంటుందని భావించి పార్టీలో చేరుతున్నట్లు నాయకులు కార్యకర్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు, యువకులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు



కాంగ్రెస్ పార్టీని వీడి బిఆర్ఎస్ పార్టీలో చేరిన మహేశ్వరం నియోజకవర్గ మైనార్టీ నాయకులు

ప్రభాత ఉదయం

# సరళ సాగర్ ప్రాజెక్టును సందర్శించిన దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్


సరళ సాగర్ వద్ద గంగమ చేస్తున్నా ఎమ్మెల్యే జిఎంఆర్


సాగర్ వరద నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్


సరళ సాగర్ వద్ద రైతులు, నాయకులతో ఎమ్మెల్యే జీఎంఆర్

కొత్తకోట,సెప్టెంబర్1(ప్రభాత ఉదయం) గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సరళ సాగర్ నిండుకుండల ఉండటంతా దేవరకద్రనీయానికి వర్గం ఎమ్మెల్యే జిఎంఆర్ అధికారులతో కలిసి సందర్శించి పరిశీలించారు. ఆదివారం మదనపురంరం మండల కేంద్రం శంకరంపేట గ్రామ పరిధిలోని సరళ సాగర్ ప్రాజెక్టు గేట్లు ఆటోమేటిక్ సైఫాన్ సిస్టం ఓపెన్ అవడంతో సరళ సాగర్ ప్రాజెక్ట్ ను సందర్శించి, అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్ అధికారులను దేవరకద్ర ఎమ్మెల్యే .జి. మధుసూదన్ రెడ్డి ఆదేశించారు. అనంతరం పోలీస్ అధికారులతో మాట్లాడుతూ... సైఫాన్ సిస్టం ఓపెన్ అవడం వల్ల పర్యాటకులు వస్తున్న సందర్భంగా సెల్ఫీలు దిగుతూ ప్రమాదాల భారిన పడే అవకాశం ఉండడం వల్ల బందోబస్తు నిర్వహించాలని పోలీస్ అధికారులకు సూచించారు.మీడియాతో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... సకాలంలో వర్షాలు కురిసి నియోజకవర్గంలో ప్రధాన జలాశయాలైన కోయిల్ సాగర్, సరళాసాగర్ నిండడం, నియోజకవర్గంలో ఎక్కడికక్కడ చెరువులు, కుంటలు అలుగు పరడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు, కాంగ్రెస్ ప్రజా పాలనపై భగవంతుడి ఆశీర్వాదం ఉండడం వల్ల సకాలంలో వర్షాలు కురవడం ప్రాజెక్టులు నిండడంతో సంతోషంగా ఉందన్నారు. భగవంతునికి ఆశీస్సులతో ప్రజలు పచ్చని పేర్లతో సుఖ సంతోషాలతో జీవిస్తారన్నారు.


ప్రైవేట్ వైద్యశాలలను తనిఖీ చేస్తున్న ఆరోగ్య శాఖ అధికారులు

## ప్రైవేట్ హాస్పిటల్స్, ల్యాబ్‌లను తనిఖీలు నిర్వహించిన జిల్లా వైద్యాధికారులు

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 1(ప్రభాత ఉదయం)జిల్లా లోని పలు ప్రైవేట్ హాస్పిటల్స్ మరియు ల్యాబ్ లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆదివారం అకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ప్రైవేట్ హాస్పిటల్స్ నిర్వహించు నిర్వాహకులకు , ల్యాబ్ టెక్నీషియన్లకు వారు పలు సూచనలు చేశారు. ప్రైవేటు ల్యాబ్ టెక్నీషియన్స్ అందరూ కిట్ మెథడ్ టెస్ట్ ద్వారా టెస్ట్ చేసి మలేరియా, డెంగు, చికున్ గునియా, వ్యాధులను పాజిటివ్ గా డిక్లేర్ చేయరాదని , అదేవిధంగా కిట్ మెథడ్ టెస్ట్ ద్వారా పాజిటివ్ వచ్చిన కేసులను టి డి హబ్ (%TD -Hub%) పంపించాలని ,%TD Hub% లో డెంగు కేసుకు ELISA టెస్ట్ చేసి, మలేరియా కేసుకు స్లైడ్ మెథడు ద్వారా, చికున్ గునియా కేసుకు ఆర్ టి పి సి ఆర్ టెస్ట్ చేసి ,ఈ టెస్ట్ లో పాజిటివ్ వచ్చిన కేసులను మాత్రమే పాజిటివ్ కేసులు అని గుర్తించి వారికి మాత్రమే క్వాలిఫైడ్ డాక్టర్లు చికిత్సలు అందించాలని తెలిపారు..అదేవిధంగా ప్రతి ప్రైవేటు డయాగ్నొస్టిక్ సెంటర్లలో కచ్చితంగా టెస్టుల పేర్లు, ప్రైస్ లిస్ట్ డిస్ప్లే చేయాలని తెలిపారు.అదేవిధంగా ప్రతి ప్రైవేటు హెల్త్ ఫెసిలిటీ లో రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, బయో మెడికల్, సర్టిఫికెట్ ,పొల్యూషన్ సర్టిఫికెట్ డిస్ప్లే చేయాలని , ఫైర్ సేఫ్టీకి సంబంధించిన సిలిండర్ ల్యాబ్ లో గోడకు ఫిక్స్ చేయాలని.. తెలిపారు.ప్రతిరోజు జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రైవేట్ హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్, క్లినిక్స్, పాలి క్లినిక్స్, ల్యాబ్స్, డయాగ్నొస్టిక్ సెంటర్ నిర్వాహకులు ప్రతిరోజు “సీజనల్ వ్యాధులకు” సంబంధించిన మలేరియా, డెంగు చికున్ గునియా , అక్యూట్ డయేరియా డిసీజెస్ కేసుల వివరాలను ప్రతిరోజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం కి అనెక్జర్ వన్ ఫామ్ ద్వారా పంపించాలని ఆదేశించారు.ప్రతి ప్రైవేటు హెల్త్ ఫెసిలిటీ నిర్వహించే నిర్వాహకులు అందరూ ఎస్ఓపి (Standard Operating Procedure) ప్రకారము రికార్డులను నిర్వహించాలని.. లేనిచో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్-2010 రూల్స్ 2011 ప్రకారము చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.కె సిద్దప్ప ఆదేశాల మేరకు సందర్శించడం జరిగిందని తెలిపారు. ఈ ప్రవేట్ హెల్త్ కేర్ ఫెసిలిటీస్ సందర్శనలో డిప్యూటీ డిఎంహెచ్వో కె. మధుసూదన్ రెడ్డి , సిహెచ్ఓ ఎం రామకృష్ణుడు , చిన్ని క్రిష్ణుడు.. పాల్గొన్నారు.



## గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ అమ్డాపూర్ ఈసీ వాగును సందర్శించిన డీపీవో.**

మొయినాబాద్ సెప్టెంబర్ 01 (ప్రభాత ఉదయం) జిల్లాలో ఉదృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, చెరువులు, కుంటల వద్దకు ప్రజలు వెల్లవద్దు అని ప్రమాదాల బారినపడవద్దు అని జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ అన్నారు. గత రెండు రోజులుగా బంగాళా కాతంలో ఏర్పడిన అల్పపీడనంతో కురుస్తున్న వర్షాల కారణంగా ఉదృతంగా ప్రవహిస్తున్న అమ్లాపూర్ ఈసీ వాగును ఆదివారం మండల అధికారులతో కలిసి ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు మండల అధికారులు ప్రజలను అప్రమత్తంగా చేయవలసిన అవసరం ఉందని సూచించారు. భారీ వర్షాలకు వాగులు, వంకలు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయని ఇటూవైపు ప్రజలను వెళ్లకుండా చూడాలని తెలిపారు. గ్రామాల్లో ఉంటున్న ప్రజలు శిధిలావస్థకు చేరిన ఇళ్లు ఉంటే ఆ కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. అదే విధంగా గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి తాగునీటి సమస్య రాకుండా చూడాలని తెలిపారు. అధికారులు అప్రమత్తంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు తలెత్తకుండా చూడాలని పేర్కొన్నారు. ఈసీ వాగును సందర్శించిన వారిలో మండల అభివృద్ధి అధికారి సంధ్య, ఎంపివో వెంకటేశ్వర్రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కవిత తదితరులు పాల్గొన్నారు.




## రంగారెడ్డి జిల్లా గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడిగా నరసింహగౌడ్


**ముఖ్య అతిథిగా మాజీ శాసన మండలి చైర్మన్ స్వామి గౌడ్ పాల్గొన్నారు**

**గౌడ్ అన్నల ఉన్నతికి కృషి చేస్తాను నరసింహ గౌడ్**

మొయినాబాద్ సెప్టెంబర్ 01 (ప్రభాత ఉదయం) మండల పరిధిలోని చిలుకూరు గ్రామంలో రంగారెడ్డి జిల్లా గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి సమావేశం జరిగింది ఈ సమావేశంలో అధ్యక్షుడు గా ఏకగ్రీవంగా నరసింహ గౌడ్ ఎన్నికయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నా పై నమ్మకం ఉంచి అధ్యక్షునిగా ఎన్నుకున్న వారికి కృతజ్ఞతలు, గౌడ్ సోదరములు అందరం ఐక్యమత్యంగా ఉండి మన హక్కుల్ని సాదించికోవాలి అందుకు నేను శక్తిమేర కృషి చేస్తానని అన్నారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ శాసన మండలి చైర్మన్ స్వామి గౌడ్ పాల్గొన్నారు అదేవిధంగా చిలుకూరు గౌడ సంఘం లో మీటింగ్ మండల కమిటీ , యూత్ కమిటీ వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు కృష్ణ గౌడ్ రాష్ట్ర అధ్యక్షుడు నేరెట్ల మల్లేష్ గౌడ్ మండల అధ్యక్షుడు అంజయ్య గౌడ్ , చిలుకూరు గౌడ సంఘం అధ్యక్షుడు ఎస్. సుభాష్ గౌడ్ మండల కేంద్రం లో ఉన్న అన్ని గ్రామల అధ్యక్షులు , గౌడకులస్తులు, గౌడ మిత్రులు అందరు పాల్గొన్నారు

## యాదగిరిగుట్ట అభివృద్ధిపై ముఖ్యమంత్రి ఆదేశాలు హర్షనీయం

**కాంగ్రెస్ పార్టీ జిల్లా ఫిషర్ మెన్ చైర్మన్ నారాయణపురం మహేందర్ ముదిరాజ్**



మొయినాబాద్ సెప్టెంబర్ 01( ప్రభాత ఉదయం) యాదగిరి గుట్ట దేవాలయం అభివృద్ధిపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం భక్తులకు హర్షించదగ్గ విషయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఫిషర్ మెన్ చైర్మన్ నారాయణపురం మహేందర్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట దేవాలయం నిలిచిపోయిన అభివృద్ధి పనులను పూర్తిస్థాయిలో వివరణ ఇవ్వాలని వెంటనే అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలపడం భక్తులకు ఎంతో సంతోషాన్ని నింపిందన్నారు. అదే విధంగా టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట దేవాలయం బోర్డు ఏర్పాటు, దేవాలయంలో రాజ గోపురానికి బంగారు తాపడం, మిగిలి ఉన్న పనులు వేగవంతం చేయాలని దీన్నిపై రిపోర్టు ఇవ్వాలని అక్కడి అధికారులను కోరినట్లు తెలిపారు. భక్తుల పట్ల రాష్ట్రముఖ్యమంత్రి దేవాలయాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నందుకు ముఖ్యమంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



## పొంగిపొర్లుతున్న మన్యవాగు

**పొంగుతున్న మన్యే వాగు, ఊక చెట్టు వాగు.. నిలిచిన రాకపోకలు**

**ఎమ్మెల్యే జిఎంఆర్ సొంత గ్రామానికి నిలిచిన రాకపోకలు**

చిన్నచింతకుంట, సెప్టెంబరు 1(ప్రభాత ఉదయం)గత మూడు రోజుల నుండి ఎడతిరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి మండలంలోని అమ్మాపూర్, కురుమూర్తి వడ్డేమాన్, పర్కాపూర్ మధ్యలో ఉండే మన్యెవాగు, ఊక చెట్టు వాగు బ్రిడ్జిలపై వరద నీరు పోటెత్తింది. ఆత్మకూర్, నర్వ మండల కేంద్రాలకు వెళ్లే అలాగే ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి సొంత గ్రామమైన దమగ్నాపూర్ గ్రామానికి కూడా రాకపోకలు నిలిచిపోయాయి. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షానికి వడ్డేమాన్ సీతారాంపేట సమీపంలోని మన్నే వాగు బ్రిడ్జిపై నుంచి వరదతో ఉప్పొంగింది. స్థానికులు ఎవరు కూడా వరద నీటిలో దాటే ప్రయత్నించరాదని బ్రిడ్జిలను సందర్శించి అక్కడ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ ఆర్ శేఖర్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.



## రామన్ పాడ్ జలాశయానికి కొనసాగుతున్న వరద.. 6 గేట్లు ఎత్తివేత

మదనాపురం, సెప్టెంబర్ 1 (ప్రభాత ఉదయం) రాష్ట్రంలో మళ్లీ వర్షాలు దంచికొడుతున్నాయి. దీంతో ప్రాజెక్టులు నిండుకుండను తలపిస్తున్నాయి. రామన్ పాడ్ జలాశయానికి కూడా వరద కొనసాగుతోంది. ప్రాజెక్టు 6 గేట్ల ద్వారా 3500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రామన్ పాడ్ ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 3500 క్యూసెక్కులుగా ఉంది ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు కోయిల్ సార్ ప్రాజెక్టు నుండి 13 గేట్లు భారీ వరద సరళ సాగర్ నుండి శంకర్ సముద్రం రిజర్వాయర్ నుంచి రెండు గేట్లు ఎత్తగా వరద పోటెత్తింది. ప్రస్తుతం ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరుతుండడంతో 6గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నట్లు రామన్ పాడ్ ఇరిగేషన్ ఏ ఈ రనిల్ రెడ్డి తెలిపారు .

## మళ్లీ తెగిన నీళ్లహాళ్లి వాగు మట్టి రోడ్డు

**వాగు ఉధృతికి తెగిన తాత్కాలిక రోడ్డు, నిలిచిన రాకపోకలు...**

**వర్షాలకు తెగిపోతున్న వాగు.. నిలిచిపోయిన రాకపోకలు**

**తాత్కాలికంగా ఏర్పాటు చేసిన దారితో అవస్థలు**

**కాంట్రాక్టర్ అలసత్వం.. అధికారుల నిర్లక్ష్యమే కారణం**



గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్1(ప్రభాత ఉదయం)ఉమ్మడి ధరూర్ మండలం నీళ్లహళ్లి పాతపాలెం గ్రామాల మద్య తాత్కాలికంగా నిర్మించిన మట్టి రోడ్డు బ్రిడ్జీ మళ్లీ తెగిపోయింది. గత రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు నీళ్లహళ్లి వాగులోకి భారీగా వరధ ఉధృతి పెరగడంతో తాత్కాలిక మట్టి రోడ్డు బ్రిడ్జీ తెగిపోయింది. నెలరోజుల వ్యవధిలో తాత్కాలిక బ్రిడ్జ తెగిపోవడం విశేషం. ఏడాది క్రితం నీళ్లహళ్లి, పాతపాలెం గ్రామాల మద్య ఉన్న వాగుపై బ్రిడ్జీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బ్రిడ్జ నిర్మాణ పనులు చేపట్టడంతో వాహనాల రాకపోకలకు తాత్కాలికంగా మట్టి రోడ్డు వేశారు. దీంతో ఉప్పేర్, నెట్టెంపాడు, నీళ్లహళ్లి, పాతపాలెం , వెంకటాపురం గ్రామాల ప్రజలు తాత్కలికంగా ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు పై రాకపోకలు కొనసాగిస్తున్నారు. గత కొన్ని రోజుల క్రితం కురిసిన వర్షాలకు నీళ్లహళ్లి వాగు ఉధృత్తంగా ప్రవహించడంతో తాత్కాలిక రోడ్డు పూర్తిగా తెగిపోయింది. మళ్లీ తాత్కాలికంగా మట్టి రోడ్డును పునఃనిర్మించారు. కాగ రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు తాత్కాలిక రోడ్డు మళ్లీ తెగిపోయింది. వర్షం వస్తే చాలు వంతెన తెగిపోవడం పునరావృతం కావడంతో పలు గ్రామాల ప్రజలు పాలకులు, అధికారుల పై తీవ్ర విమర్శలు గుప్పించారు. రెండేళ్లు కావొస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడం పాలకులు, అధికారుల పనితీరుకు నిదర్శనం అని మండి పడుతున్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టినా ఇప్పటి వరకు పూర్తి చేయకుండా అట్టి సమస్యలను గాలికి వదిలేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

### బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయ్యేనా

చుట్టూ ఉన్న అయిదారు గ్రామాలకు వెళ్లాలంటే నీళ్లహళ్లి పాతపాలెం గ్రామాల మద్య ఉన్న బ్రిడ్జి మార్గమే దిక్కు. కానీ, వానాకాలం వస్తే మాత్రం ఆ బ్రిడ్జిపై రాకపోకలు సాగించాలంటే ప్రాణాలతో చెలగాటం ఆడినట్టే. ఏడాది క్రితం వాగుపై బ్రిడ్జినిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడంతో ఆ గ్రామ ప్రజలు ఊపిరిపీల్చుకున్నారుమ బ్రిడ్జీ నిర్మాణ పూర్తై వాగుపై రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని అందరూ అనుకున్నారు కాని...రెండేండ్లు కావొస్తున్న నీళ్లహళ్లి వాగుపై నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు వర్షాకాలంలో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. బ్రిడ్జీ నిర్మాణానికి పనులు ప్రారంభించిన ఇప్పటి వరకు పూర్తి చేయకపోవడం ఆ గ్రామ ప్రజలకు శాపంగా మారింది. భారీ వర్షాలకు వాగు ఉధృత్తంగా ప్రవహించడంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు నెల రోజుల వ్యవధిలోనే రెండు సార్లు కొట్టుకపోయింది. అధికారులు కంటితుడుపు చర్యగా తాత్కాలికంగా మరమ్మతులు చేసి వదిలేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని మండలంలోని నెట్టెంపాడు, నీళ్లహళ్లి, పాతాపాలెం, ఈర్లబండ తదితర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి బ్రిడ్జీ నిర్మాణ పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని కోరుతున్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్

**భారీ వర్షాల కారణంగా నేడు ప్రజావాణి రద్దు**

గద్వాల జిల్లా ప్రతినిధి,సెప్టెంబర్ 1(ప్రభాత ఉదయం) జిల్లాలో భారీ వర్షాల కారణంగా చెరువులు, కుంటలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రజలకు, ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో జిల్లా అధికారులందరూ తమ తమ పనులలో నిమగ్నమై ఉన్నందున (సెప్టెంబర్ 2వ తేదీ సోమవారం) నిర్వహించు ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినందున ఇట్టి విషయాన్ని గమనించి, జిల్లా ప్రజలు కలెక్టర్ కార్యాలయానికి వచ్చి అసౌకర్యానికి గురికావద్దని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.


గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. “RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.